సాక్షి
పశ్చిమగోదావరి
మంగళవారం । 3 । అక్టోబర్ । 2023



శానిటరీ న్యాప్కిన్స్ సిద్ధం

ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో బాలికల డ్రాపవుట్స్ తగ్గించడానికి ప్రభుత్వం ఉచితంగా శానిటరీ న్యాప్కిన్స్ అందించనుంది. 8లో



పారిశుద్ధ్య కార్మికుల ఆరోగ్యంపై దృష్టి

స్వచ్ఛతాహీ సేవాలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీలో విధులు నిర్వహించే పారిశుద్ధ్య కార్మికుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించింది. 8లో



యోగాసన జట్ల ఎంపిక

స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ అండర్–19 బాలబాలికల యోగాసన జిల్లా జట్ల ఎంపిక సోమవారం నూజివీడు ట్రిపుల్‌ఐటీలో నిర్వహించారు. 8లో

న్యూస్‌రీల్

హైకోర్టు న్యాయమూర్తి పూజలు



మద్ది క్షేత్రంలో జడ్జికి చిత్రపటం అందిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం రూరల్/జంగారెడ్డిగూడెం: గురవాయిగూడెంలోని మద్ది ఆంజనేయ స్వామి క్షేత్రం, జంగారెడ్డిగూడెంలోని గోకుల తిరుమల పారిజాతగిరివాసుడిని హైకోర్టు న్యాయమూర్తి టి.మల్లికార్జునరావు కుటుంబ సమేతంగా సందర్శించారు. అధికారులు వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. న్యాయమూర్తి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేయించారు. జంగారెడ్డిగూడెం జూనియర్ సివిల్ జడ్జి సీహెచ్ కిషోర్‌కుమార్, భీమడోలు జడ్జి టి.హ్యాసిక్, ఎస్సై మల్లికార్జునరెడ్డి వారి వెంట ఉన్నారు. మద్ది ఆలయ పర్యవేక్షకులు జవ్వాది కృష్ణ, పారిజాతగిరి ఆలయ ఈఓ మానికల రాంబాబు ఉన్నారు.

చినవెంకన్న సేవలో..

ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమల చిన వెంకన్న ఆలయాన్ని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ టి.మల్లికార్జునరావు కుటుంబ సమేతంగా సందర్శించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేయించారు. అర్చకులు, పండితులు ఆయనకు శ్రీవారి శేషవస్త్రాన్ని కప్పి, వేద ఆశీర్వచనాన్ని పలకగా, ఈఓ త్రినాథరావు స్వామివారి మెమెంటోను, ప్రసాదాలను అందజేశారు.

కళాకారుల గుర్తింపు కార్డుల కోసం దరఖాస్తులు

భీమవరం (ప్రకాశంచౌక్): జిల్లాలోని కళాకారులు గుర్తింపు కార్డుల కోసం ఈనెల 7లోపు దరఖాస్తులు సమర్పించాలని జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి టి.నాగేశ్వరరావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. జెండర్, బ్లడ్‌గ్రూప్, తండ్రి పేరు, పుట్టిన తేదీ, చిరునామా, జిల్లా, కళారూపం, అనుభవం, మొబైల్ నంబర్, ఆధార్ నంబర్, ఈమెయిల్ అడ్రస్ తదితర వివరాలను తెలుపుతూ సంబంధిత ఆధారాల నకళ్లు జతచేసి దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. పూర్తిచేసిన దరఖాస్తులను 7వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ కార్యాలయం, పశ్చిమగోదావరి జిల్లా కలెక్టరేట్ కాంపౌండ్, మొదటి అంతస్తు, రూమ్ నం –213, 7వ వార్డు, మల్లేతోట, భీమవరం –534201 చిరునామాకు పంపాలని సూచించారు. మరిన్ని వివరాలకు కార్యాలయపు పనివేళల్లో సెల్ 73820 17485 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

పారిశుద్ధ్య కార్మికుల సేవలు నిరుపమానం



ద్వారకాతిరుమల పీహెచ్‌సీలో సూచనలిస్తున్న కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

ద్వారకాతిరుమల: పారిశుద్ధ్య కార్మికులు సమాజానికి అందిస్తున్న సేవలు నిరుపమానమని కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ అన్నారు. సోమవారం గాంధీ జయంతి సందర్భంగా ద్వారకాతిరుమల పీహెచ్‌సీలో పారిశుద్ధ్య కార్మికులకు నిర్వహించిన ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఆయన పరిశీలించారు. మండలంలోని పారిశుద్ధ్య కార్మికులతో పాటు శ్రీవారి దేవస్థానంలో పనిచేస్తున్న కార్మికులు మొత్తం 200 మందికి వైద్యులు ఆరోగ్య పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కోవిడ్ సమయంలో మాత్రమే కాకుండా అన్ని వేళల్లో డాక్టర్లు, వైద్య సిబ్బందితో పాటు పారిశుద్ధ్య కార్మికుల సేవలు ఎనలేనివన్నారు.

ఆరు నెలలకోసారి ఆరోగ్య పరీక్షలు

జిల్లాలోని క్లాప్ మిత్రలకు ప్రతి ఆరు నెలలకోసారి సంపూర్ణ ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తామని కలెక్టర్ తెలిపారు. జిల్లాలోని అన్ని మండల కేంద్రాల్లోని పీహెచ్‌సీల్లో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారని, ఈ కార్యక్రమం రాష్ట్రంలో తొలిసారిగా ఏలూరు జిల్లాలోనే చేపట్టి ఆదర్శంగా నిలిచామన్నారు. ప్రధాని పిలుపులో భాగంగా స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమంలో శ్రమదానం చేసి రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలిచామన్నారు. క్లాప్ మిత్రలకు రక్తపరీక్ష తదితర వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందించడంతో పాటు రక్తపోటు, మధుమేహంలకు సంబంధించి చికిత్స అందిస్తారన్నారు.

కాఫీ విత్ క్లాప్ మిత్ర

క్లాప్ మిత్రల్లో మరింత ఆత్మస్థైర్యం నింపి, వారి సమస్యలను తెలుసుకునేందుకు జిల్లాలో చేపట్టిన కాఫీ విత్ క్లాప్ మిత్ర కార్యక్రమం రాష్ట్రానికే ఆదర్శంగా నిలిచిందని కలెక్టర్ అన్నారు. దీని ద్వారా సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ షెడ్లను జిల్లా, మండల స్థాయి అధికారులు సందర్శించి క్లాప్ మిత్రలతో మమేకమవుతారన్నారు.

మహాత్ముడి స్ఫూర్తితో ఆదర్శ పాలన

ఘనంగా గాంధీ జయంతి



తాడేపల్లిగూడెం అర్బన్ : గాంధీ విగ్రహానికి త్రివర్ణ మాల వేస్తున్న మంత్రి కొట్టు సత్యనారాయణ



తణుకు అర్బన్ : గాంధీజీ విగ్రహానికి పూలమాల వేస్తున్న మంత్రి కారుమూరి నాగేశ్వరరావు



భీమవరం (ప్రకాశం చౌక్) : కలెక్టరేట్‌లో గాంధీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న అధికారులు

తాడేపల్లిగూడెం అర్బన్: మహాత్మాగాంధీ స్ఫూర్తితో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదర్శ పాలన అందిస్తున్నారని ఉప ముఖ్యమంత్రి, దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. గాంధీ జయంతి సందర్భంగా స్థానిక గాంధీ మండపంలో విగ్రహానికి ఆయన త్రివర్ణ దండలు వేసి నివాళులర్పించారు. మహాత్ముడు కలలు కన్న గ్రామ స్వరాజ్యాన్ని నెరవేర్చిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా సచివాలయ, వలంటీర్ వ్యవస్థల ద్వారా పాలనను ప్రజలకు చేరువ చేశారన్నారు. మున్సిపల్ కమిషనర్ డాక్టర్ అనపర్తి శామ్యూల్, కర్రి భాస్కరరావు, బొడ్డు సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

గాంధీ మార్గం అనుసరణీయం

తణుకు అర్బన్: జాతిపిత మహాత్మా గాంధీ మార్గం అనుసరణీయమని రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. సోమవారం గాంధీ జయంతి సందర్భంగా తణుకు రాష్ట్రపతి రోడ్డులోని మహాత్ముడి విగ్రహానికి మంత్రి కారుమూరి, ఆయన సతీమణి లక్ష్మీకిరణ్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. మహాత్ముడి కలలను సాకారం చేసేందుకు సీఎం జగన్ ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఈ మేరకు సచివాలయ వ్యవస్థను ఏర్పాటుచేసిందని అన్నారు.

కలెక్టరేట్‌లో..

భీమవరం (ప్రకాశంచౌక్): గాంధీజీ అడుగుజాడల్లో యువత ముందుకు సాగాలని జాయింట్ కలెక్టర్ ఎస్.రామసుందర్‌రెడ్డి అన్నారు. భీమవరం కలెక్టరేట్ ప్రాంగణంలోని గాంధీజీ విగ్రహానికి అధికారులతో కలిసి ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ కానాల సంగీత్ మాధుర్, కలెక్టరేట్ ఏవో వైకేవీ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

తీరంలో మెగా ప్రాజెక్ట్

అభివృద్ధి కెరటం

- పట్టాలెక్కనున్న ఫిషింగ్ హార్బర్
- రూ.429.43 కోట్లతో పనులు
- వచ్చే నెలలో ప్రారంభం
- పూర్తయిన టెండర్ల ప్రక్రియ





హార్బర్ నిర్మించనున్న బియ్యపుతిప్ప తీర ప్రాంతం, (ఇన్‌సెట్‌లో) ఫిషింగ్ హార్బర్ డిజైన్

సాక్షి ప్రతినిధి, ఏలూరు: పశ్చిమ సముద్ర తీరంలో మెగా ప్రాజెక్టుకు అడుగులు పడ్డాయి. నరసాపురం తీర ప్రాంతంలో దశాబ్దాల కలగా ఉన్న ఫిషింగ్ హార్బర్ పనులు వచ్చే నెల నుంచి ప్రారంభం కానున్నాయి. హార్బర్ నిర్మాణానికి అనువైన స్థలం, పూర్తి అవసరాలు తీర్చేలా ప్రభుత్వ భూమి అందుబాటులో ఉండటంతో హార్బర్ ప్రాంతాన్ని ఎంపిక చేసి ప్రతిపాదనలు ఖరారు చేసి టెండర్ ప్రక్రియ పూర్తి చేసి కాంట్రాక్టర్లకు అప్పగించారు. పర్యావరణ అనుమతులతో సహా అన్ని లాంఛనాలు పూర్తి చేసుకుని రూ.429.43 కోట్లతో హార్బర్ నిర్మాణ పనులు మొదలుకానున్నాయి. ఇప్పటికే హార్బర్ నిర్మాణ పనులను విశ్వసముద్ర సంస్థ దక్కించుకుంది.

త్వరితగతిన ప్రక్రియ

నరసాపురం నియోజకవర్గంలోని పీఎం లంక–బియ్యపుతిప్ప గ్రామాల మధ్య స్థలాన్ని ప్రభుత్వ భూమిని గుర్తించి హార్బర్‌కు కేటాయించారు. పనులకు ఇప్పటికే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి శంకుస్థాపన కూడా పూర్తి చేశారు. హార్బర్ నిర్మాణానికి ఈ ఏడాది మే నెలలో ఏపీ మారిటైమ్ బోర్డు టెండర్లు పిలవగా విశ్వ సముద్ర సంస్థ పనులు దక్కించుకుంది. వెంటనే ప్రాథమిక సర్వే ఆ సంస్థ చేపట్టింది. నిర్మాణానికి సంబంధించి సరుకుల రవాణా కోసం రోడ్డు మార్గాలు చూసుకోవడం, ప్రాజెక్ట్ స్వరూపంపై సర్వే చేయడం లాంటి పనులు పూర్తి చేసుకుని పనులను కొద్దిరోజుల్లో ప్రారంభించనుంది.

దశాబ్దాల కల : ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో నరసాపురం నియోజకవర్గంలో 19 కిలోమీటర్ల మేర సముద్ర తీరం ఉంది. ఈ ప్రాంతంలో బియ్యపుతిప్ప వద్ద ఫిషింగ్ హార్బర్ నిర్మించాలనే డిమాండ్ చాలా కాలంగా ఉంది. ఈ ప్రాంతంలో 10 వేల మత్స్యకార కుటుంబాలు వేటపై ఆధారపడి జీవిస్తున్నాయి. అయితే మత్స్యకారుల సంక్షేమంపై గత ప్రభుత్వాలు దృష్టి పెట్టిన దాఖలాలు లేవు. దీంతో బియ్యపుతిప్ప హార్బర్ డిమాండ్ అలాగే ఉండిపోయింది. మత్స్య సంపద, ఆక్వా ఎగుమతుల్లో ఉమ్మడి పశ్చిమకు రాష్ట్రంలోనే ప్రత్యేక స్థానం ఉంది. ఇక కొత్తగా ఏర్పడ్డ డెల్టా ప్రాంతంతో కూడిన పశ్చిమగోదావరి జిల్లా నుంచి దేశ, విదేశాలకు భారీగా ఆక్వా ఉత్పత్తులు ఎగుమతి అవుతున్నాయి. రొయ్యలు, చేపల సాగు పెరగడంతో ఆక్వా రంగం పుంజుకుంది. ఏటా కోట్లాది రూపాయల విదేశీ మారకద్రవ్యం ఆక్వా రంగం నుంచి జిల్లాకు వస్తోంది. ఇటు తీర ప్రాంతంలో సముద్ర మత్స్యసంపద ద్వారా కూడా భారీగా ఆదాయం సమకూరుతుంది. ఏటా నరసాపురం తీరంలో రూ.300 కోట్ల విలువ చేసే మత్స్య ఎగుమతులు సాగుతాయి. హార్బర్ లాంటి మౌలిక వసతులు ఉంటే మరో 40 శాతం ఎగుమతులు పెరిగే అవకాశం ఉంది.

వేగంగా పనులు పూర్తిచేసేలా..



బియ్యపుతిప్ప ఫిషింగ్ హార్బర్ నిర్మించాలని దశాబ్దాలుగా మత్స్యకారులు కోరుతున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ కలను సాకారం చేశారు. హార్బర్ నిర్మాణానికి పర్యావరణ అనుమతులు, సాంకేతిక అనుమతులు వచ్చాయి. మరికొన్ని రోజుల్లో పనులు మొదలు పెడతారు. పనుల్లో తాత్సారం లేకుండా నిర్ణీత కాలంలో పనులు పూర్తి చేసేలా టెండర్‌దారుడితో ప్రభుత్వం ఒప్పందం చేసుకుంది.

–ముదునూరి ప్రసాదరాజు, ప్రభుత్వ చీఫ్ విప్

బియ్యపుతిప్ప ఫిషింగ్ హార్బర్

విస్తీర్ణం	వ్యయం
600 ఎకరాలు	429.43 రూ. కోట్లు

ప్లాట్‌ఫామ్‌ల సామర్థ్యం	కోల్డ్ స్టోరేజీల సామర్థ్యం
300 బోట్లు	500 టన్నులు

హార్బర్ స్వరూపం

బియ్యపుతిప్ప ఫిషింగ్ హార్బర్‌ను 600 ఎకరాల విస్తీర్ణంలో రూ.429.43 కోట్ల భారీ వ్యయంతో నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. అందుబాటులో ఉన్న ప్రభుత్వ స్థలాన్ని ఏడాది క్రితమే సిద్ధం చేసి ఉంచారు. హార్బర్ వద్ద నిత్యం 300 వరకు వేట బోట్లు నిలిచేలా ప్లాట్‌ఫామ్‌లు నిర్మిస్తారు. సముద్రంలో లభ్యమైన సరుకును నిల్వ చేసుకోవడానికి కోల్డ్ స్టోరేజ్‌లు కూడా నిర్మిస్తారు. ఏకకాలంలో 500 టన్నుల మత్స్య ఉత్పత్తులను నిల్వ చేసుకోవడానికి వీలుగా కోల్డ్ స్టోరేజ్‌లు నిర్మించనున్నారు. తుపాన్లు వంటి ప్రకృతి విపత్తుల సమయంలో వేట సాగించే మత్స్యకారుల రక్షణకు సంబంధించి సామగ్రి హార్బర్‌లో అందుబాటులో ఉంటుంది. హార్బర్ త్వరలో అందుబాటులోకి వస్తే ఆక్వా ఉత్పత్తుల ఎగుమతులకు మహర్దశ పట్టనుంది.

సచివాలయ ఆవిర్భావ దినోత్సవం



తాడేపల్లిగూడెంలో కేక్ కట్ చేస్తున్న డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం (టీఓసీ): డెమోక్రటిక్ అసోసియేషన్ 69/21 ఆధ్వర్యంలో పట్టణంలో సచివాలయ ఆవిర్భావ దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ కేక్ కట్ చేసి మాట్లాడుతూ సీఎం జగన్ ఆధ్వర్యంలో ప్రజలకు పారదర్శకంగా సేవలు అందుతున్నాయన్నారు. గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్య స్థాపన లక్ష్యంగా సచివాయ వ్యవస్థను ఏర్పాటుచేశారన్నారు. దీని ద్వారా 1.30 లక్షల నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించారన్నారు. సచివాలయ వ్యవస్థ ఏర్పడి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా అభినందనలు తెలిపారు. రాష్ట్ర అధ్యక్షుడు జి.జోసెఫ్ కిషోర్, జిల్లా ప్రెసిడెంట్ జోగేంద్ర కుమార్, జిల్లా సభ్యులు ఎన్.రజని, జి.మంగరాజు, కె.రాజా, పి.నాగబాబు పాల్గొన్నారు.

ట్రాఫిక్ మళ్లింపు

సాక్షి, భీమవరం: భీమవరం నుంచి యనమదుర్రు వెళ్లే దారిలో గంగానమ్మ గుడికి సమీపంలో కల్వర్టు నిర్మాణ పనులు చేపట్టారు. దీని దృష్ట్యా ట్రాఫిక్‌ను మళ్లించినట్లు డీఎస్పీ బి.శ్రీనాథ్ తెలిపారు. దిరుసుమర్రు నుంచి వచ్చే వాహనాలు గంగానమ్మ గుడికి కుడివైపు ఉన్న రోడ్డు మీదుగా బ్యాంకు కాలనీ నుంచి పట్టణంలోకి వెళ్లాలన్నారు. భీమవరం నుంచి యనమదుర్రు వెళ్లే ద్విచక్రవాహనాలు ప్రకాశం చౌక్ నుంచి టౌన్‌హాల్ రోడ్డులో గంగానమ్మ గుడి వైపుగా ట్రాఫిక్ మళ్లించామన్నారు.

చకచకా భూ సర్వే

- ఫేజ్–3లో 104 గ్రామాల్లో రీ సర్వే
- 1.75 లక్షల ఎకరాల్లో సర్వే
- విధుల్లో 558 మంది సిబ్బంది



భీమవరం మండలం బేతపూడిలో సర్వే రాళ్లు వేయిస్తున్న దృశ్యం

భీమవరం (ప్రకాశంచౌక్): జిల్లాలో వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు–భూరక్ష పథకంలో భూముల రీసర్వే దశల వారీగా చురుగ్గా సాగుతోంది. ప్రస్తుతం ఫేజ్–3 పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. జిల్లాలోని 20 మండలాల్లోని 104 గ్రామాల్లో సిబ్బంది డ్రోన్ ఫ్లై, ఆర్థోరెటిఫైడ్ ఇమేజస్ ప్రక్రియ పూర్తి చేసి సర్వే ఆఫ్ ఇండియా నుంచి ఫొటోలు కూడా రావడంతో భూముల సర్వే చేపట్టారు. వచ్చే డిసెంబర్ నాటికి పనులు పూర్తిచేసేలా అధికారులు పటిష్ట కార్యాచరణ అమలు చేస్తున్నారు.

ఇప్పటివరకు 70 వేల ఎకరాల్లో

భూ సర్వే ఫేజ్–3లో 1.75 లక్షల ఎకరాలను సర్వే చేస్తున్నారు. ఇందులో ప్రైవేట్ భూమి 1.50 లక్షల ఎకరాలు కాగా ప్రభుత్వ భూమి 25 వేలు ఎకరాలు ఉంది. సర్వే పూర్తిచేసి సుమారు 60 వేల మందికి హక్కు పత్రాలు పంపిణీ చేయనున్నారు. ఇప్పటివరకూ 70 వేల ఎకరాలల్లో సర్వే పూర్తయ్యింది.

మొదటి రెండు దశల్లో..

జిల్లాలో భూ సర్వే ఫేజ్–1, ఫేజ్–2లో 1.18 లక్షల ఎకరాల్లో సర్వే పూర్తి చేశారు. ఫేజ్–1లో 16 మండలల్లో 16 గ్రామాల్లో 18 వేల ఎకరాల్లో సర్వే చేసి 6 వేల హక్కు పత్రాలను అందించారు. ఫేజ్–2లో 12 మండలాల్లో 53 గ్రామాల్లో 1.18 లక్షల ఎకరాల్లో సర్వే పూర్తి చేసి 38 వేల మందికి భూ హక్కు పత్రాలు పంపిణీ చేశారు.

ఆధునిక పరికరాలతో..

సర్వే శాఖ, రెవెన్యూ శాఖ అధికారులు, సిబ్బందితో కలిసి సర్వే పనులు చేస్తున్నారు. ఆధునిక పరికరాలైన డ్రోన్, రోవర్ వంటివి ఉపయోగిస్తున్నారు.

ముమ్మరంగా పనులు



జిల్లాలో ఇప్పటికే రెండు దశల భూసర్వే పూర్తయ్యింది. మూడో దశ రీ సర్వే ముమ్మరంగా సాగుతోంది. పనులు చేపట్టిన 104 గ్రామాల్లో సర్వేకు ముందు చేసే డ్రోన్ ఫ్లైతో పాటు అన్ని పనులు పూర్తి చేసి భూమి మీద సర్వే చేస్తున్నాం. సర్వేలో 558 మంది సిబ్బంది పనిచేస్తున్నారు. 20 మండలాల తహసీల్దార్లు సర్వేలో పాల్గొన్ని పూర్తి సహకరం అందించడంతో పాటు పర్యవేక్షిస్తున్నారు. సర్వే పూర్తి చేసిన భూముల్లో సర్వే రాళ్లను కూడా పాతిస్తున్నాం.

–జాషువా, జిల్లా సర్వే అధికారి

ముందుగా సర్వే చేస్తున్న గ్రామాల్లోని భూములపై డ్రోన్ ఫ్లై చేసి ఇమేజ్‌ను సేకరిస్తున్నారు. ఆర్థోరెటిఫైడ్ ఇమేజస్ కోసం రోవర్‌ను ఉపయోగిస్తున్నారు. సర్వే ఆఫ్ ఇండియా నుంచి నమూనా వచ్చిన తర్వాత భూముల సర్వే చేసి వేగంగా సరిహద్దు రాళ్లను ప్రభుత్వమే ఉచితంగా పాతిస్తుంది.

మూడో విడత భూ సర్వే

మండలం	గ్రామాలు	ఎకరాలు
తాడేపల్లిగూడెం	6	14,367.5
పెంటపాడు	7	9,595
ఇరగవరం	13	9,300
అత్తిలి	6	17,212
యలమంచిలి	4	4,427.5
పోడూరు	7	11,505
పెనుమంట్ర	4	5,097.5
పెనుగొండ	9	11,025
పాలకొల్లు	2	3,492.5
నరసాపురం	6	6,077.5
ఆచంట	2	2,124
వీరవాసరం	2	5,575
పాలకోడేరు	7	16,450
ఉండి	9	15,275
కాళ్ల	4	12,515
గణపవరం	4	4,947.5
ఆకివీడు	7	20,172.05
భీమవరం	4	12,600
తణుకు	1	1,802.5

ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు



ప్రజలకు పాలనను చేరువ చేయడమే లక్ష్యంగా రాష్ట్రంలో సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా సోమవారం తాడేపల్లిగూడెం మండలం మాధవరం సచివాలయం వద్ద సీఎం జగన్ చిత్రపటానికి సచివాలయ సిబ్బంది క్షీరాభిషేకం చేశారు. థ్యాంక్యూ సీఎం సార్ అని నినదించారు. ఏఎంసీ డైరెక్టర్ తమ్మిశెట్టి చుక్కయ్య, నవాబుపాలెం సొసైటీ చైర్మన్ జడ్డు హరిబాబు, సచివాలయ సిబ్బంది అనంతలక్ష్మి, గాయత్రి, శ్రీనివాస్, వలంటీర్లు పాల్గొన్నారు.

– తాడేపల్లిగూడెం రూరల్

విద్యుత్ వినియోగంలో జాగ్రత్తలు పాటించాలి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): జిల్లాలో ఇకపై ప్రతినెలా 2వ తేదీన విద్యుత్ భద్రతా దినోత్సవాన్ని నిర్వహించనున్నామని ఏపీఈపీడీసీఎల్ ఏలూరు ఆపరేషన్ సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజనీర్ పి.సాల్మన్ రాజు తెలిపారు. సోమవారం స్థానిక విద్యుత్ భవన్, సర్కిల్ ఆఫీసులో విద్యుత్ భద్రతా దినోత్సవం నిర్వహించారు. గోడ పత్రికలు, కరపత్రాలను ఆవిష్కరించి, విద్యుత్ సిబ్బంది, వినియోగదారులు, భవన నిర్మాణ కార్మికులు విద్యుత్ ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సూచనలను తెలియజేస్తూ ప్రతిజ్ఞ చేయించారు. వినియోగదారులంతా తగిన జాగ్రత్తలు పాటించి విద్యుత్ శాఖ అధికారులకు, సిబ్బందికి సహకరించాలని ఎస్ఈ కోరారు. ఏలూరు సర్కిల్ పరిధిలోని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని అన్ని సెక్షన్ కార్యాలయాల్లో విద్యుత్ సిబ్బంది, విద్యుత్ వినియోగదారులతో విద్యుత్ భద్రత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారన్నారు. ఏదైనా విద్యుత్ అంతరాయం లేదా సమస్య తలెత్తితే టోల్ ఫ్రీ నంబరు 1912కు ఫోన్ చేసి తెలియజేవచ్చని సూచించారు.

నేడు 20 గ్రామాల్లో ఆరోగ్య సురక్ష క్యాంపులు



భీమవరం(ప్రకాశం చౌక్): జిల్లాలోని 20 గ్రామాల్లో మంగళవారం ఆరోగ్య సురక్ష శిబిరాలు నిర్వహించనున్నట్టు జగనన్న ఆరోగ్య సురక్ష నోడల్ ఆఫీసర్ డాక్టర్ భానునాయక్ తెలిపారు. ఆచంట మండలం పెద్దమల్లంలోని సచివాలయం, ఆకివీడు మండలం అప్పారావుపేటలోని సచివాలయం, అత్తిలి మండలం ఈడూరులోని సచివాలయం, భీమవరం మండలం దొంగపిండిలోని ఎంపీపీ స్కూల్, యలమంచిలి మండలం అడవిపాలెంలో సచివాలయం, గణపవరం మండలం కేశవరంలో సచివాలయం, ఇరగవరం మండలం అర్జునుడుపాలెంలోని యూపీ పాఠశాల, కాళ్ల మండలం దొడ్డనపూడిలో సచివాలయంలో శిబిరాలు నిర్వహిస్తామన్నారు. అలాగే మొగల్తూరు మండలం జగన్నాథపురంలోని పాఠశాల, నరసాపురం మండలం నవరసపురంలో విలేజ్ క్లినిక్, పాలకోడేరులోని సచివాలయం, పాలకొల్లు మండలం ఆగర్తిపాలెంలో సచివాలయం, పెంటపాడు మండలం పడమర విప్పర్రులో పాత సచివాలయం, పెనుగొండ మండలంలోని చినమల్లం కేశవస్వామి దేవస్థానం వద్ద, పెనుమంట్ర మండలం ఆలమూరులోని సచివాలయం, పోడూరు మండలం తూర్పుపాలెంలో గ్రామ పంచాయతీ, తాడేపల్లిగూడెం మండలం కడియద్దలోని సచివాలయం, తణుకు మండలం దువ్వలో విలేజ్ క్లినిక్, ఉండి మండలం పెద్దపుల్లేరులోని ఎంపీయూపీ స్కూల్, వీరవాసరం మండలం వడ్డిగూడెంలోని సచివాలయంలో శిబిరాలు నిర్వహిస్తామన్నారు.

క్లుప్తంగా

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి


మృతుడు చల్లాది నాగరాజు (ఫైల్)

కొయ్యలగూడెం: అనుమానాస్పద స్థితిలో ఒక యువకుడు మృతిచెందాడని పోలీసులు తెలిపారు. ఆరిపాటి సమీపంలోని మెయిన్ రోడ్డు రహదారి పక్కన తాడేపల్లిగూడెం గ్రామానికి చెందిన చల్లాది నాగరాజు (22) మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. అతను అక్టోబరు ఒకటిన రాత్రి సమయంలో మృతి చెంది ఉండొచ్చని పోలీసులు భావిస్తున్నారు. బైక్‌పై వెళ్తుండగా అదుపుతప్పి పడిపోయి ఉండవచ్చని పేర్కొన్నారు. రాడ్ బిల్డింగ్ చేసే నాగరాజు పోతవరంలో కాంట్రాక్టు పనులు చేస్తున్నాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మందలించారని ఆత్మహత్య

పెనుగొండ: మద్యంకు బానిసై పనికి సరిగా వెళ్లక పోవడంతో కుటుంబసభ్యులు మందలించగా ఒక వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పెనుగొండ ఎస్సై ఎస్ఎన్‌వీవీ రమేష్ తెలిపిన వివరాల ప్రకారం తూర్పుగోదావరి జిల్లా పెరవలి మండలం ఖండవల్లికి చెందిన యర్రంశెట్టి లక్ష్మణ్(22) తాపీ పనులు చేసేవాడు. ఇటీవల మద్యంకు బానిసై పనికి వెళ్లకపోవడంతో ఇంట్లో మందలించారు. గత నెల 30న ఇంటి నుంచి వెళ్లిపోయి దొంగరావిపాలెం వద్ద బ్రిడ్జిపై దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు, ఆత్మహత్యకు పాల్పడే ముందు సోదరుడికి ఫోన్ చేసి సమాచారం ఇచ్చాడు. సంఘటన స్థలానికి వచ్చి గాలించినా మృతదేహం ఆచూకీ లభించలేదు. సోమవారం మృతదేహం తేలడంతో బంధువులు పోలీసులకు సమాచారం అందించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వైనాట్ వెంకట్రాయుడికి అవార్డు



నటి మెహ్రీన్ పిర్జాద చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న వెంకట్రాయుడు దంపతులు

తణుకు: రాష్ట్రంలో ఉత్తమ ఎలక్ట్రానిక్స్ అండ్ హోమ్ అప్లయన్సెస్ స్టోర్‌గా 2022–23 సంవత్సరానికి అవార్డు అందుకున్నట్లు తణుకు పట్టణానికి చెందిన వైనాట్ షాపింగ్ మాల్ అధినేత జుజ్జువరపు వెంకట్రాయుడు తెలిపారు. విజయవాడ నోవాటెల్‌లో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ప్రముఖ నటి మెహ్రీన్ పిర్జాద చేతుల మీదుగా అవార్డు అందుకున్నట్లు చెప్పారు. ఉభయగోదావరి జిల్లాలతోపాటు విశాఖపట్టణంలో ఎలక్ట్రానిక్ ఉత్పత్తులు, గృహోపకరణాల అమ్మకాలు, అత్యుత్తమ ప్రతిభకు అవార్డు అందుకున్నట్లు చెప్పారు.

పారిశుధ్య కార్మికుల ఆరోగ్యంపై దృష్టి

క్లాప్ మిత్రలకు ఆరోగ్య పరీక్షలు

ఏలూరు(మెట్రో): స్వచ్ఛతాహి సేవా కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీలో విధులు నిర్వహించే పారిశుధ్య కార్మికుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించింది. వారి ఆరోగ్య పరిస్థితులు, వారి కుటుంబ సభ్యుల ఆరోగ్య పరిస్థితులను పరీక్షించేందుకు చర్యలు తీసుకుంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గత 15 రోజులుగా స్వచ్ఛతాహి సేవా కార్యక్రమాన్ని నిర్వహిస్తూ ప్రత్యేకంగా కార్మికుల స్థితిగతులను పరిశీలిస్తూ వారి కుటుంబ ఆరోగ్య పరిస్థితులపై దృష్టి కేంద్రీకరించారు. కార్మికుల కుటుంబసభ్యులకు సైతం ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్నారు.

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గత నెల 15న ప్రారంభమైన స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమాలు మహాత్మా గాంధీ 155వ జయంతి వరకు నిర్వహించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఏలూరు జిల్లాలో 547 పంచాయతీల పరిధిలో 1,385 మంది క్లాప్‌మిత్రలు విధులు నిర్వహిస్తున్నారు. పశ్చిమగోదావరి జిల్లా వ్యాప్తంగా 1163 మంది 409 పంచాయతీల పరిధిలో విధులు నిర్వహిస్తున్నారు. పశ్చిమ గోదావరి జిల్లాలో 3,52,953 గృహాలలో ఉన్న 13,55,756 మంది ప్రజలకు వీరు సేవలు అందిస్తుండగా, ఏలూరు జిల్లాలో 5,50,000 గృహాలలో 18 లక్షల మంది ప్రజలకు క్లాప్ మిత్రలు పారిశుధ్య సేవలు అందిస్తున్నారు.


ద్వారకాతిరుమలలో పారిశుధ్య కార్మికుల ఆరోగ్య పరిస్థితి తెలుసుకుంటున్న కలెక్టర్


కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

ఆరోగ్యశ్రీలో వైద్యం

ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం వీరి ఆరోగ్యంపై పూర్తి దృష్టి కేంద్రీకరించింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా క్లాప్ మిత్రలు ఆరోగ్యంపై దృష్టి పెట్టి వైద్య పరీక్షలు నిర్వహించేందుకు చర్యలు తీసుకుంది. ప్రస్తుతం ఆయా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో వైద్యుల ద్వారా ఆరోగ్య పరీక్షలు నిర్వహించి కావాల్సిన వైద్యసేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. మెరుగైన వైద్యం అవసరమయితే వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ద్వారా చికిత్సలు అందించేందుకు జిల్లా పంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. పారిశుధ్య కార్మికులకు ప్రత్యేక వైద్యపరీక్షలు చేయించాలని దానికి తగ్గట్లుగానే ఏర్పాట్లు చేయాలని కలెక్టర్లు పంచాయతీ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. కార్మికులందరికీ బీమా సౌకర్యం కల్పించేలా చర్యలు తీసుకుంటున్నారు. ఇళ్ల స్థలాలు లేకపోతే ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు సైతం చర్యలు తీసుకోవాలని కలెక్టర్లను ఆదేశించారు. ఏలూరు జిల్లా వ్యాప్తంగా 1,448 మంది పారిశుధ్య కార్మికులకు, పశ్చిమగోదావరి జిల్లా వ్యాప్తంగా 1,400 పారిశుధ్య కార్మికులకు వైద్యపరీక్షలు, రక్తపరీక్షలు, ఈసీజీ పరీక్షలు చేపట్టారు.

పారిశుధ్య కార్మికులకు వైద్య పరీక్షలు



అపారిశుధ్య వాతావరణం లేకుండా చర్యలు తీసుకునే కార్మికుల ఆరోగ్యం పట్ల ప్రభుత్వం దృష్టి కేంద్రీకరించింది. వారికి ప్రత్యేక వైద్యపరీక్షలు నిర్వహించేందుకు ప్రభుత్వం ఆదేశాల మేరకు కలెక్టర్ ప్రత్యేక చొరవ తీసుకున్నారు. దీనిలో భాగంగా వైద్యపరీక్షలు నిర్వహించడంతో పాటు ప్రత్యేకంగా ఉన్నత వైద్యం కోసం ఆరోగ్య శ్రీ ద్వారా సిఫార్సు చేసి అవసరమైన వైద్యసేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

తూతిక శ్రీనివాస విశ్వనాథ్, జిల్లా పంచాయతీ అధికారి

ఫొటో, వీడియోగ్రాఫర్స్ అసోసియేషన్ కార్యవర్గం విస్తరణ


ఫొటో, వీడియోగ్రాఫర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గ సభ్యులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఏలూరు జిల్లా ఫొటో అండ్ వీడియోగ్రాఫర్స్ అసోసియేషన్ కార్యవర్గ సమావేశం ఆదివారం జిల్లాలోని జంగారెడ్డిగూడెం రాజుల కాలనీ లయన్స్‌క్లబ్ ఆడిటోరియంలో గౌరవ అధ్యక్షుడు వీరభద్రరావు ఆధ్వర్యంలో నిర్వహించామని సంఘం జిల్లా కార్యదర్శి మెగా దుర్గారావు తెలిపారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు మద్దాల శేఖర్ ఆధ్వర్యంలో జిల్లా కార్యవర్గ విస్తరణ జరిగింది. దీనిలో భాగంగా అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడిగా ఎస్ఎం షరీఫ్(జంగారెడ్డిగూడెం), శ్రీనివాసరావు (చింతలపూడి), పీ.దుర్గారావు(కొయ్యలగూడెం), సహాయక కోశాధికారిగా మధు (బుట్టాయిగూడెం), ఎస్‌కే కాలేషా (జీలుగుమిల్లి), గణేష్(జంగారెడ్డిగూడెం), ఆర్గనైజింగ్ సెక్రటరీగా కే ప్రభాకర్, ఈసీ మెంబర్లుగా డీ రమణ, ఆదినారాయణ, రవీందర్ రెడ్డి, ఎస్‌కే ఖాదర్లను నియమించారు. ఈ సందర్భంగా మెగా దుర్గారావు మాట్లాడుతూ అసోసియేషన్ సభ్యులందరికీ జిల్లా స్థాయి డిజిటల్ ఐడీ కార్డులను అందిస్తామని, వ్యక్తిగత బీమా కల్పిస్తామన్నారు.

శానిటరీ న్యాప్కిన్స్ పంపిణీకి సిద్ధం

- జిల్లాలోని 283 స్కూళ్లలో 30 వేల మందికి సరఫరా
- అక్టోబర్‌లో స్కూళ్లకు 12 లక్షల న్యాప్కిన్స్

సాక్షి, భీమవరం: విద్యకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్న రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో బాలికల డ్రాపవుట్స్ తగ్గించడానికి ఉచితంగా శానిటరీ న్యాప్కిన్స్ రెండో విడత పంపిణీకి రంగం సిద్ధం చేసింది. బాలికల డ్రాపవుట్స్‌కు కారణమవుతున్న రుతుక్రమ సమయంలో ఇబ్బందులు పరిష్కరించేందుకు 2020–21 విద్యాసంవత్సరంలో ప్రభుత్వం స్వేచ్ఛ పథకాన్ని ప్రారంభించింది. కౌమార దశలో ఉన్న బాలికలు రుతుస్రావం సమయంలో స్కూళ్లు, కళాశాలకు వెళ్లడం మానేస్తుడడంతో డ్రాపవుట్స్ పెరుగుతున్నాయి. ఈ పరిస్థితిని నివారించడంతోపాటు రుతుక్రమం సమయంలో బాలికల వ్యక్తిగత పరిశుభ్రత, ఆరోగ్యానికి ప్రాధాన్యతనిస్తూ నాణ్యమైన శానిటరీ ప్యాడ్స్‌ను ప్రభుత్వమే ఉచితంగా పంపిణీ చేస్తోంది. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ పాఠశాలల్లో సకల సౌకర్యాలు కల్పించడానికి మనబడి నాడు–నేడు పథకం ద్వారా పనులు చేపట్టింది. అమ్మ ఒడి, ఫీజు రీయింబర్స్‌మెంట్, జగనన్న విద్యాదీవెన, వసతి దీవెన, గోరుముద్ద వంటి అనేక పథకాల ద్వారా పేద విద్యార్థులకు లబ్ధి చేకూర్చుతున్నారు.

జిల్లాలో 12 లక్షల న్యాప్కిన్స్ పంపిణీ

జిల్లాలోని 283 ప్రభుత్వ అప్పర్ ప్రైమరీ, ఉన్నత పాఠశాలల్లోని 7 నుంచి 10వ తరగతి విద్యార్థులతోపాటు జూనియర్ కళాశాలల్లోని విద్యార్థినులకు గత మూడేళ్లుగా శానిటరీ న్యాప్కిన్స్ పంపిణీ చేస్తున్నారు. సుమారు 30 వేల మందికి ఒక్కొక్కరికి నెలకు 10 చొప్పున అందిస్తున్నారు. జూన్‌లో సుమారు 3.70 లక్షలు పంపిణీ చేయగా అక్టోబర్‌లో నాలుగు నెలలకు సరిపడా సుమారు 12 లక్షల న్యాప్కిన్స్ పంపిణీ చేయడానికి ఏర్పాట్లు చేశారు.


భీమవరం ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థినులు

విద్యా శాఖ ఆధ్వర్యంలోనే

కౌమారదశలోని విద్యార్థినులకు గతంలో మహిళా శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో న్యాప్కిన్స్ పంపిణీ చేయగా ఈ ఏడాది పాఠశాల విద్యాశాఖలోని మధ్యాహ్న భోజన పథకం విభాగానికి అప్పగించారు. దీంతో న్యాప్కిన్స్‌ను ముగ్గురు సభ్యులతో కూడిన బృందం నాణ్యత పరిశీలించి ఏ స్కూల్‌కు ఎన్ని అవసరమో గుర్తించి పాఠశాలకు అప్పగిస్తారు. అక్కడ సైన్స్ టీచర్స్ ఆధ్వర్యంలో పంపిణీ చేస్తారు. రుతుక్రమంలో ఎదురయ్యే సమస్యలు, నివారణ చర్యలపై విద్యార్థినుల్లో అవగాహన కల్పించడానికి మహిళా ఉపాధ్యాయినిలు, మహిళా పోలీసుల ద్వారా పాఠశాలల్లో సదస్సులు కూడా నిర్వహిస్తున్నారు.

ఏర్పాట్లు పూర్తయ్యాయి



శానిటరీ న్యాప్కిన్స్‌ను ఒకేసారి నాలుగు నెలలకు సరిపడా పంపిణీ చేస్తాం. ఒక్కొక్కరికి నెలకు 10 చొప్పున అందిస్తాం. జిల్లాలోని 283 స్కూళ్లు, జూనియర్ కళాశాలకు సంబంధించి దాదాపు 12 లక్షల న్యాప్కిన్స్ ప్రభుత్వం పంపిణీ చేయనుంది. పాఠశాలలకు చేరిన న్యాప్కిన్స్‌ను ఆయా విద్యాసంస్థల్లోని సైన్స్‌టీచర్స్ ఆధ్వర్యంలో అందిస్తారు.

ఆర్.వెంకటరమణ, జిల్లా విద్యాశాఖాధికారి, భీమవరం

గడపగడపకు సంక్షేమం


పెదపాడు: మండలంలోని నాయుడుగూడెంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి

యోగాసన జిల్లా జట్ల ఎంపిక

నూజివీడు: ఉమ్మడి కృష్ణా జిల్లా పరిధిలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్–19 బాలబాలికల యోగాసన జిల్లా జట్ల ఎంపిక సోమవారం నూజివీడు ట్రిపుల్‌ఐటీలో నిర్వహించారు. ట్రెడిషనల్, ఆర్టిస్టిక్, రిథమిక్ కేటగిరీలకు పోటీలు జరగగా గెలిచిన విద్యార్థులను రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ఈ పోటీలకు అబ్జర్వర్‌గా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ తరపున శేషు వ్యవహరించగా, రాజమహేంద్రవరం శాప్ కోచ్, నాగేంద్రన్, కారపురెడ్డి పద్మజ న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. ఎంపికైన విద్యార్థులు త్వరలో రాష్ట్ర స్థాయి పోటీలలో కృష్ణా జిల్లాకు ప్రాతినిధ్యం వహిస్తారు. ట్రెడిషనల్ విభాగంలో బాలుర జట్టుకు నూజివీడు ట్రిపుల్‌ఐటీకి చెందిన టీ దుర్గాప్రసాద్, టీ అభిషేక్, కే జశ్వంత్, ఏ జబ్బార్‌ఖాన్, జీ చెంగయ్య, సీహెచ్ దీపక్ నాయుడు, పీ షణ్ముఖ వికాస్, బాలికల్లో విజయవాడ మేరీస్ స్టెల్లా కాలేజీకి చెందిన ఎం బృందా, ట్రిపుల్‌ఐటీకి చెందిన పీ మేఘన, ఎన్ అక్షరప్రియ, జే హేమ విశాలిసాయిదుర్గ, బీ ఉదయిక, టీ తనూజ, ఏ లక్ష్మీ ప్రవీణ ఎంపికయ్యారు. ఆర్టిస్టిక్ బాలురలో టీ అభిషేక్, బాలికల్లో పీ మేఘన, రిథమిక్ బాలురలో టీ దుర్గాప్రసాద్, బాలికల్లో జీ స్వర్ణలత ఎంపికయ్యారు. వీరందరిని ట్రిపుల్‌ఐటీ డైరెక్టర్ ఆచార్య జీవీఆర్ శ్రీనివాసరావు, ఏవో ప్రదీప్ కుమార్, డీన్ అకడమిక్స్ లక్ష్మణ్ తదితరులు అభినందించారు.

తూర్పుగోదావరి వెళ్లి పెన్షన్ అందజేత


మల్లమ్మకు పెన్షన్ అందచేస్తున్న వలంటీర్ బాలాజీ

వీరవాసరం: మడుగుపోలవరం పంచాయతీ జొన్నలపాలెం –1 గ్రామానికి చెందిన కట్టా మల్లమ్మ అనారోగ్యంతో తూర్పు గోదావరి జిల్లాలో పంగిడిలో కూతురు వద్ద ఉంటుంది. అక్టోబర్ నెల పెన్షన్ తీసుకోవడానికి రాలేని పరిస్థితిలో ఉండడంతో సోమవారం మడుగు పోలవరం గ్రామ సచివాలయం జొన్నలపాలెం –1 వలంటీర్ గంటా బాలాజీ పంగిడి వెళ్లి వృద్ధురాలికి పెన్షన్ ఇచ్చారు. వలంటీర్‌ను గ్రామస్తులు, అధికారులు అభినందించారు.

బై.. బై.. గణేశా

క్షేత్రంలో అట్టహాసంగా గణేష్ ఊరేగింపు


అశ్వవాహనంపై ఊరేగుతున్న గణేషుడు

ద్వారకాతిరుమల: పుష్ప అశ్వ వాహనంపై కొలువైన గణనాథుడు సోమవారం క్షేత్ర పురవీధుల్లో భక్తులకు దర్శనమిచ్చారు. స్థానిక బైపాస్ రోడ్డులో శ్రీ విఘ్నేశ్వర యూత్ ఆధ్వర్యంలో గణేష్ నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరిగాయి. ఉత్సవాల ముగింపును పురస్కరించుకుని గణేష్ ఊరేగింపు, నిమజ్జన వేడుకలను కమిటీ సభ్యులు అట్టహాసంగా నిర్వహించారు. ముందుగా సుగంధభరిత పుష్ప మాలికలతో శోభాయమానంగా అలంకరించిన అశ్వ వాహనంపై స్వామివారిని వేంచేపు చేశారు. పూజాదికాల అనంతరం ఊరేగింపును ప్రారంభించారు. శక్తి వేషధారణలు, తీన్మార్ డప్పు వాయిద్యాలు, డీజే సందళ్లు, యువత డాన్సులు, చిత్రవిచిత్ర వేషధారణల నడుమ ఈ ఊరేగింపును నిర్వహించారు.


శక్తి వేషధారణలు

బాస్కెట్‌బాల్ రన్నర్స్‌గా పశ్చిమ గోదావరి జట్టు


మహిళల విభాగంలో ప్రథమ స్థానం సాధించిన అనంతపురం జట్టు


పురుషుల విభాగంలో విజేత తూర్పుగోదావరి జట్టు


మహిళల విభాగంలో ద్వితీయ స్థానం సాధించిన పశ్చిమ గోదావరి జట్టు


పురుషుల విభాగంలో ద్వితీయ స్థానం సాధించిన పశ్చిమ గోదావరి

ద్వితీయ స్థానం సాధించిన పశ్చిమ గోదావరి జట్టు

పెనుమంట్ర: మార్టేరులో జరిగిన అంతర్ జిల్లాల రాష్ట్ర స్థాయి బాస్కెట్‌బాల్ పోటీల్లో పురుషుల విభాగంలో తూర్పుగోదావరి, మహిళా విభాగంలో అనంతరపురం జట్లు విజయం సాధించాయి. పురుషుల, మహిళల విభాగంలో పశ్చిమ గోదావరి జట్టు రెండో స్థానం దక్కింది. మహిళల విభాగంలో అనంతపురం జట్టు 55 పాయింట్లతో పశ్చిమపై విజయం సాధించింది. పురుషుల విభాగంలో తూర్పుగోదావరి జట్టు 65 పాయింట్లతో పశ్చిమ గోదావరిపై గెలుపొందింది. పురుషుల విభాగంలో అనంతపురం, వైజాగ్, మహిళల విభాగంలో తూర్పుగోదావరి, కృష్ణా జిల్లాల జట్లు తృతీయ స్థానాలు దక్కించుకున్నాయి. విజేతలకు చెరుకువాడ శ్రీరంగనాధరాజు ఎమ్మెల్యే కప్‌లను అమలాపురం ఎంపీ చింతా అనురాధ, జెడ్పీ చైర్‌పర్సన్ గంటా పద్మశ్రీ చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు, ఏఎంసీ చైర్‌పర్సన్ వెలగల వెంకటరమణ, ఎంపీపీ కర్రి వెంకటనారాయణరెడ్డి, జెడ్పీటీసీ కర్రి గౌరీ సుభాషిణి, సర్పంచ్ మట్టాకుమారి, మామిడిశెట్టి ధనలక్ష్మి, ఎంపీటీసీ గుడిమెట్ల లక్ష్మణరెడ్డి, కర్రి అనురాధ, పెనుగొండ లక్ష్మి, ఓఎన్‌జీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అమిత్‌నారాయణ, ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు అల్లం భాస్కరరెడ్డి, గుడిమెట్ల లక్ష్మణరెడ్డి, సత్తి సుబ్బన్నరెడ్డి, గొలుగూరి సత్యనారాయణరెడ్డి, పడాల శ్రీనివాసరెడ్డి, కర్రి వినాయకరెడ్డి పాల్గొన్నారు.

తబలా విద్వాన్ కేకే రాజుకు సన్మానం


తబలా విద్వాన్ కేకే రాజును సన్మానిస్తున్న అతిథులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): హిందూస్థానీ తబలా విద్వాన్ కేకే రాజు దేశానికి వేలాది మంది కళాకారులను అందించారని పలువురు వక్తలు అన్నారు. నగరానికి చెందిన ఎస్‌పీఎస్ మ్యూజిక్ అకాడమీ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక రామకృష్ణాపురంలోని సాహిత్య మండలిలో నిర్వహించిన కార్యక్రమంలో విద్వాన్ కేకే రాజును ఆయన శిష్యులు ఘనంగా సత్కరించి సద్గురు బిరుదు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న పలువురు అతిథులు మాట్లాడుతూ కేకే రాజు తబలా కళలో ఉన్నత శిఖరాలు అధిరోహించారని, హిందూస్థానీ సంగీతంలో ఆయన తబలా విన్యాసాలకు ప్రత్యేక స్థానముందన్నారు. ఆయన శిష్యరికంలో ఎంతోమంది కళాకారులు రూపొంది తబలా వాద్య కళను విశ్వవ్యాప్తం చేస్తున్నారన్నారు. అకాడమీ వ్యవస్థాపకుడు ఎస్‌పీఎస్ వాసు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కళారత్న కేవీ సత్యనారాయణ, ఎండీ ఖాజావలీ, నగరపాలక సంస్థ కో–ఆప్షన్ సభ్యురాలు నీతా విజయకుమార్ జైన్, హేలాపురి కళాకారుల సంక్షేమ సంఘం కార్యదర్శి పెదపాటి రామకృష్ణ, రచయితల సంఘం అధ్యక్షుడు లంకా వెంకటేశ్వర్లు, మానవత సంస్థ ప్రతినిధి ఆలపాటి నాగేశ్వర రావు, జైన సంఘం ప్రతినిధి విజయ్ కుమార్ జైన్, బీవీఆర్ కళాక్షేత్రం వ్యవస్థాపకుడు బీవీ రామారావు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

విద్యుత్ భద్రతా దినోత్సవం



తణుకులో ప్రతిజ్ఞ చేస్తున్న విద్యుత్ శాఖ సిబ్బంది, అధికారులు

తణుకు: విద్యుత్ ప్రమాదాల నివారణకు తణుకు సబ్‌డివిజన్ పరిధిలో సోమవారం భద్రతా దినోత్సవాన్ని నిర్వహించారు. స్థానిక కార్యాలయం ఆవరణలో ఏడీఈ సీహెచ్ రామకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రమాదాలు జరగకుండా సిబ్బంది తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. అనంతరం భద్రతా ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్ప పడిపూజ



బల్లిపాడులో పడిపూజ నిర్వహిస్తున్న దృశ్యం

అత్తిలి: బల్లిపాడు శ్రీఅయ్యప్ప దీక్షా మందిరంలో గణపతిహోమం, మహా పడిపూజ మహోత్సవం నేత్రపర్వంగా జరిగింది. పేరాబత్తుల గురుస్వామి 36వ ఏటా అయ్యప్పమాలధారణచేసి, శబరిమల యాత్రకు వెళుతున్న సందర్భంగా శ్రీస్వామివారికి పంచామృతాలతో అభిషేకం, గణపతిహోమం, విశేష పూజలు జరిపారు. పలువురు వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ హోమ పూజలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. పుష్పాలు, అరటి చెట్టు తొడుగులతో ప్రత్యేకంగా అలంకరించిన మందిరంలో శ్రీఅయ్యప్పస్వామివారిని ఉంచి పడిపూజా మహోత్సవాన్ని జరిపారు. ఈ సందర్భంగా పేరాబత్తుల రామకృష్ణ గురుస్వామి సహకారంతో ఆలయ ప్రాంగణం వద్ద అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు. అయ్యప్పమాలధారణ భక్తులు పాల్గొన్నారు.

4న లైవ్‌స్టాక్ మిషన్‌పై శిక్షణ

తణుకు: జిల్లాలో గొర్రెలు, మేకల పెంపకందారులకు జాతీయ లైవ్‌స్టాక్ మిషన్ ఆధ్వర్యంలో ఈనెల 4న తణుకులో ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా పశుసంవర్ధక అధికారి డాక్టర్ మురళీకృష్ణ తెలిపారు. తణుకు జాతీయ రహదారి ఆనుకుని నెక్ కల్యాణ మండపంలో జరిగే ఈ కార్యక్రమంలో ఆయా రంగాల్లోని నిపుణులైన శాస్త్రవేత్తలు పాల్గొని సలహాలు, సూచనలతోపాటు జాతీయ లైవ్‌స్టాక్ మిషన్ ద్వారా రాయితీ రుణాలు పొందే విధివిధానాలు వివరిస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా మంత్రులు కారుమూరి వెంకట నాగేశ్వరరావు, కొట్టు సత్యనారాయణ, జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి, రాష్ట్ర పశుసంవర్ధక శాఖ డైరెక్టర్ డాక్టర్ ఆర్.అమరేంద్రకుమార్ హాజరవుతారని వివరించారు.

కరాటేలో ప్రతిభ



కరాటేలో ప్రతిభ చూపిన విద్యార్థులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఇటీవల ఏలూరులో నిర్వహించిన ఏపీ షాటోకాన్ కరాటే చాంపియన్ షిప్ పోటీల్లో తాడేపల్లిగూడెం విద్యార్థులు ప్రతిభ చూపారు. కటా, కుమితి విభాగాల్లో ఎస్‌కే లీనా బ్లాక్ బెల్ట్, రెండు గోల్డ్ మెడల్స్, ఎస్.హరి వెంకటేష్ రెండు గోల్డ్ మెడల్స్, పి.ఖలీల్ రెండు సిల్వర్ మెడల్స్, బీవి వందన కాంస్య, సిల్వర్ మెడల్స్ సాధించారు. వివిధ వయస్సుల కటా విభాగాల్లో ఎస్‌కే నసిరా, టి.రోహిత్‌రెడ్డి, జె.పియూష్‌లు గోల్డ్ మెడల్స్, బి.జగదీష్, సింహ, పి.సాత్వికరాజ్, సీహెచ్ హర్షిత, ఎస్.రోహిత్, బి.టనీష్, ఆర్ చంద్రమౌళి, బి.దీక్షిత్, ఎస్‌కే హుసేన్, హాన్వితలు సిల్వర్ మెడల్స్, ఎస్.పునీత్‌రెడ్డి, ఎం.కారుణ్య, ఎస్.మాధవ్‌లు క్యాంస్య పతకాలు సాధించారు. ఇన్‌స్ట్రక్టర్ ఎ.శ్యాంబాలాజీని విద్యార్థుల తల్లిదండ్రులు అభినందించారు.

తెలుగు సాహితీ సమాఖ్య అధ్యక్షుడిగా బ్రహ్మాజీ

తాడేపల్లిగూడెం (టీఓసీ): తెలుగు సాహితీ సమాఖ్య నూతన అధ్యక్షుడిగా మండా బ్రహ్మాజీ, కోశాధికారిగా మండవల్లి నాగేంద్రరావు, ప్రధాన కార్యదర్శిగా పైలు శ్రీనివాసరావు ఎన్నికయ్యారు. సోమవారం రాత్రి స్థానిక ధన రెసిడెన్సీలో తెలుగు సాహితీ సమాఖ్య వార్షికోత్సవం నిర్వహించారు. గౌరవాధ్యక్షుడిగా ఈతకోట తాతాజీ, ఉపాధ్యక్షుడిగా గోదావరి ప్రభాకర్ శాస్త్రి, పసుపులేటి రామచంద్రరావు, మాడభూషి జ్యోతి కుమారి, సమన్వయకర్తగా గరికపాటి బాపయ్య శర్మ, సహాయ సమన్వయకర్తగా పాల్వంచ తిరుమల వెంకటేశ్వర్లు, సహాయ కార్యదర్శులుగా తగరంపూడి మురళీకృష్ణ, గాదే శ్రీరామమూర్తి, ఆకుల నవదుర్గా ప్రసాద్, గురువు హరిబాబు, యద్దనపూడి సుబ్బారావు తదితరులు ఎంపికయ్యారు.

డ్రాయింగ్‌లో దండగర్ర విద్యార్థిని ప్రతిభ

తాడేపల్లిగూడెం రూరల్: గాంధీజీ జయంతిని పురస్కరించుకుని జిల్లా సర్వోదయ మండలి నిర్వహించిన డ్రాయింగ్ పోటీల్లో దండగర్ర హైస్కూల్ 8వ తరగతి విద్యార్థిని వీరమళ్ల జ్యోతి వైష్ణవి జూనియర్స్ విభాగంలో జిల్లా తృతీయ స్థానం సాధించిందని హెచ్‌ఎం సీహెచ్ చంద్రశేఖర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

గాంధీజీ ఆశయాలు అనుసరణీయం

తాడేపల్లిగూడెం: గాంధీ ఆశయాలు అనుసరణీయమని, నేటియువత ఆయన్ని ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని ఏపీ నిట్ డీన్ రీసెర్చ్ అండ్ కన్సల్టెన్సీ డాక్టర్ జీఆర్‌కే శాస్త్రి అన్నారు. నిట్ ఇన్‌చార్జి డైరెక్టర్ డాక్టర్ ఎం.ప్రమోద్ పడోలే ఆధ్వర్యంలో రిజిస్ట్రార్ డాక్టర్ పి.దినేష్ శంకర్ రెడ్డి పర్యవేక్షణలో జాతిపిత మహాత్మాగాంధీ జయంతిని ఏపీ నిట్ ప్రాంగణంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. నిట్ ప్రధాన ద్వారం వద్ద ఉన్న గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆచార్యులు డాక్టర్ వి.సందీప్, డాక్టర్ కిరణ్ తీపర్తి, డాక్టర్ రాముడు, డాక్టర్ కృష్ణమూర్తి, డాక్టర్ భరణిదరన్, డాక్టర్ సుభాని పాల్గొన్నారు.



నిట్ గాంధీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం



ఉద్యాన వర్సిటీలో శ్రమదానంలో పాల్గొన్న వీసీ జానకీరామ్ తదితరులు

మహోన్నత వ్యక్తి గాంధీ

జాతిని ఒక్క తాటిపై నడిపి దేశానికి స్వాతంత్ర్యం తీసుకొచ్చిన మహోన్నవ్యక్తి జాతిపిత గాంధీ అని డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయంలో జరిగిన గాంధీ జయంతి వేడుకల్లో వీసీ టి.జానకీరామ్ అన్నారు. తొలుత ప్రధాని మోదీ పిలుపునుసరించి శ్రమదాన్ కార్యక్రమం నిర్వహించారు. వర్సిటీ అధికారులు పాల్గొన్నారు.

జాతిపితకు ఘన నివాళి

తాడేపల్లిగూడెం (టీఓసీ): జాతిపిత మహాత్మాగాంధీ జయంతిని పట్టణ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పడాల జీవన సంధ్య వృద్ధాశ్రమంలో అన్నదానం చేశారు. అధ్యక్షుడు కేవీ చలం, కార్యదర్శి పి.కుమారస్వామి, కోశాధికారి పీవీ పరమాత్మ, వాకర్స్ సభ్యులు పాల్గొన్నారు.

- లయన్స్‌క్లబ్ ఆఫ్ డైమండ్స్ జోన్ చైర్‌పర్సన్ పేరిచర్ల మురళీకృష్ణంరాజు ఆధ్వర్యంలో గాంధీ జయంతి, లాల్ బహదూర్ శాస్త్రి జయంతి కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. జిల్లా గవర్నర్ గట్టిం మాణిక్యాలరావు, జిల్లా కోఆర్డినేటర్ వి.సత్యస్వరూప్, ఆర్‌సీ మదన్ మోహన్ అగర్వాల్, తదితరులు పాల్గొన్నారు.
- లయన్స్‌క్లబ్ ఆఫ్ తాడేపల్లిగూడెం అధ్యక్షుడు వంగపండు రామ మోహన్‌రావు ఆధ్వర్యంలో కడకట్ల జనతా చారిటబుల్ ట్రస్ట్ ఆసుపత్రిలో 97 మందికి రక్త పరీక్షలు చేశారు. కార్యక్రమాన్ని మల్లిడి కనికిరెడ్డి, కొండబాబు, రీజియన్ చైర్‌పర్సన్ మదన్‌మోహన్ అగర్వాల్‌లు పర్యవేక్షించారు.
- సుబ్బారావుపేట భవిత దివ్యాంగుల శిక్షణ కేంద్రంలో విద్యార్థుల వేషధారణలు ఆకట్టుకున్నాయి. భవిత సెంటర్ సిబ్బంది, దివ్యాంగుల విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.
- బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి, తాడేపల్లిగూడెం చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీస్ అధ్యక్షుడు ఈతకోట తాతాజీ, జిల్లా ఇన్‌చార్జి మాల కొండయ్య, బీజేపీ జిల్లా అధ్యక్షులు నార్ని తాతాజీలు పట్టణంలో మహాత్మాగాంధీ, లాల్ బహదూర్ శాస్త్రిల జయంతి కార్యక్రమాలు నిర్వహించారు.



వాకర్స్ ఆధ్వర్యంలో గాంధీ జయంతి



గాంధీజీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎంపీడీఓ విశ్వనాథ్

బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

- గాంధీ మండపంలోని గాంధీ విగ్రహానికి కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మార్నీడి బాబ్జి పూలమాల వేసి నివాళ్లలర్పించారు.
- సిపాయిపేటలోని బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ భవనంలో గాంధీ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఏఐటీయూసీ నాయకులు పాలూరి లక్ష్మణరావు, సంఘ అధ్యక్షులు పడాల శ్రీనివాస్, దువ్వా శ్రీనివాస్, పోలిరాతి ఆదినారాయణ పాల్గొన్నారు.

గాంధీజీ మార్గం అనుసరణీయం

తాడేపల్లిగూడెం రూరల్: గాంధీజీ శాంతి, అహింస మార్గాలే అనుసరణీయమని ఎంపీడీఓ ఎం.విశ్వనాథ్ అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గాంధీజీ విగ్రహానికి విశ్వనాథ్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. జూనియర్ అసిస్టెంట్ కె.సత్యభరత్‌కుమార్, జె.రత్నకుమార్, కంప్యూటర్ ఆపరేటర్ నాగమణి తదితరులు పాల్గొన్నారు. మోదుగ గుంట గాంధీ బొమ్మ సెంటర్‌లో గాంధీజీ విగ్రహానికి మాజీ సర్పంచ్ ఏపూరి సత్యనారాయణ పూలమాలలు వేసి నివాళులర్పించారు. గుల్లపల్లి కొండలరావు, చనుబోయిన పోలయ్య, భువనగిరి, గోపాలకృష్ణ, గుల్లపల్లి కొండరాజు తదితరులు పాల్గొన్నారు. తాడేపల్లిగూడెం మండలం మాధవరం, వెంకట్రామన్నగూడెం, చిన తాడేపల్లి తదితర గ్రామాల్లోని సచివాలయం వద్ద గాంధీజీ జయంతిని నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శి వి.వాణి, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, అంగన్‌వాడీ, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

పెంటపాడు మండలంలో..

పెంటపాడు: మండలంలోని గాంధీ జయంతిని ఘనంగా నిర్వహించారు. ప్రత్తిపాడు గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద గాంధీజీ చిత్రపటానికి వైఎస్సార్ సీపీ మండల శాఖ పూర్వాధ్యక్షుడు వీర్ల గోవింద్, ఎంపీడీఓ బాలాజీలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మండల కార్యాలయంలో ఎంపీడీఓ బాలాజీ, పెంటపాడు సచివాలయం వద్ద సర్పంచ్ తాడేపల్లి సూర్యకళ, పరిమెళ్లలో సర్పంచ్ గొర్రెల కోటేశ్వరరావు తదితరులు గాంధీజీ విగ్రహాల వద్ద నివాళులర్పించారు. రోడ్లపై చెత్తను ఊడ్చి శుభ్రం చేశారు. ప్రభుత్వం అందించిన చెత్త డబ్బాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు నల్లమిల్లి విజయానందరెడ్డి, ఎంపీటీసీ సభ్యులు రెడ్డి సూరిబాబు, కర్రి వరహాలరెడ్డి, ఉపసర్పంచ్ కొవ్వూరి ప్రసాద్‌రెడ్డి, తాడేపల్లి ఈశ్వరరావు, ప్రేమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

- జట్లపాలెం ప్రాథమికోన్నత పాఠశాలలో మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు రూ.10 వేల విలువైన ఆటవస్తువులు, డిక్షనరీలు, విద్యాసామగ్రిని పంపిణీ చేశారు. మానవత ఉమ్మడి జిల్లా చైర్మన్ తాడేపల్లి మోహనరావు, మండల వ్యవసాయసలహా మండలి చైర్మన్ కట్టుబోయిన కృష్ణప్రసాద్, ఎంఈఓ టీవీ రామకృష్ణ, సర్పంచ్ ఖండవల్లి మణిరాజు, ఎంపీటీసీ సభ్యురాలు కట్టుబోయిన నాగమణి, విశ్రాంత ఉపాధ్యాయులు కట్టుబోయిన నాగేశ్వరరావు పాల్గొన్నారు. మీనవిల్లూరు ఆర్బీకే సెంటర్ వద్ద నిర్వహించిన కార్యక్రమంలో విగ్రహదాతలు స్వీట్లు పంచారు.

గాంధీజీని యువత స్ఫూర్తిగా తీసుకోవాలి

తణుకు టౌన్: జాతిపిత మహాత్మాగాంధీ స్ఫూర్తితో నేటి యువత సామాజిక సేవలో పాల్గొనాలని ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్ అన్నారు. మహాత్మాగాంధీ జయంతి సందర్భంగా పైడిపర్రు – తేతలి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో తణుకు సజ్జాపురంలో సోమవారం నిర్వహించిన గాంధీ జయంతి వేడుకలలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాత్మాగాంధీ ఆచరించిన అహింసా సిద్ధాంతం ప్రపంచ వ్యాప్తంగా ఎందరినో ప్రభావితం చేసిందన్నారు. గాంధీ ఆశయాలు, సిద్ధాంతాల ఆచరణ నేడు ఎంతో అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో తణుకు మున్సిపల్ మాజీ చైర్మన్ వంక రాజకుమారి, తేతలి–పైడిపర్రు లయన్స్ క్లబ్ అధ్యక్షుడు వంటెద్దు రాజా, కార్యదర్శి కుడారి సజని, కోశాధికారి చర్ల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో..

గాంధీజీ జయంతి సందర్భంగా వాసవీ ఇంటర్నేషనల్, వాసవి రాయల్స్, వాసవి వనితా క్లబ్‌ల ఆధ్వర్యంలో సోమవారం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం తణుకులోని ఎస్ఎస్‌సీ బోస్ రోడ్డులో బీసీ హాస్టల్ విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పెన్‌లు, బిస్కెట్‌లు పంపిణీ చేశారు. హాస్టల్‌కు సీలింగ్ ఫ్యాన్‌లు అందజేశారు. ఇరగవరం రోడ్డు, రైల్వే స్టేషన్ వద్ద గల ఆశ్రమాల్లోని వృద్ధులకు పండ్లు, రొట్టెలు, పాలు, పంపిణీ చేశారు. వేల్పూరులోని గోశాలలో ధ్వజ స్తంభం, తణుకు ఆంజనేయస్వామి ఆలయంలో సిమెంట్ బెంచీలను ఏర్పాటుచేశారు. ఈ కార్యక్రమాల్లో వాసవీ ఇంటర్నేషనల్ గవర్నర్ కొర్లేపర కృష్ణాజీ, జోన్ చైర్మన్ గుడిమెట్ల రాజేశ్వరరావు, రాయల్ క్లబ్ అధ్యక్షుడు జవ్వాది వీరభద్రయ్య, కార్యదర్శి కందుల రాజమౌళి గుప్తా, కోశాధికారి కెమురళీ, వనితా క్లబ్ అధ్యక్షురాలు ఆకుల వేదకుమారి, కోశాధికారి గూడూరి గీత, వివిధ క్లబ్‌ల సభ్యులు పాల్గొన్నారు.



ప్రత్తిపాడు పంచాయతీ వద్ద గాంధీజీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు, అధికారులు



గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్, క్లబ్ సభ్యులు



తణుకులో వృద్ధులకు పండ్లు పంపిణీ చేస్తున్న కృష్ణాజీ తదితరులు

ఖైదీలు సత్ప్రవర్తనతో మెలగాలి

తణుకు అర్బన్: జైళ్లలో ఖైదీలు సహనం, సత్ప్రవర్తనతో క్రమశిక్షణగా మెలగాలని నాలుగో అదనపు జిల్లా జడ్జి డి.సత్యవతి అన్నారు. మహాత్మాగాంధీజీ జయంతి సందర్భంగా సోమవారం తణుకు సబ్ జైలులో ఖైదీల సంక్షేమ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ క్షణికావేశంలో చేసే చిన్న చిన్న పొరపాట్లు జైలు దారి పట్టిస్తాయని, ఆ సమయంలో కొంత సహనం పాటిస్తే సమస్య పరిష్కారం అవుతుందని అన్నారు. ముందుగా గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి కె.కృష్ణసత్యలత, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి పీవీఎస్ రంజిత్‌కుమార్, బార్ అసోసియేషన్ అధ్యక్షులు సూరంపూడి కామేష్, కార్యదర్శి కేవీవీఎస్ఎన్ మూర్తి, సభ్యులు సీహెచ్ నాగేశ్వరరావు, జెడ్పీటీసీ సభ్యులు అంజిబాబు, ఫైర్ ఆఫీసర్ అజయ్, న్యాయవాదులు కె.వెంకటేశ్వర్లు, కె.మునిస్వామి, క్రాంతిప్రసాద్, సుధాకరరావు, జైలు సిబ్బంది పాల్గొన్నారు.



తణుకు సమావేశంలో మాట్లాడుతున్న న్యాయమూర్తి డి.సత్యవతి

బలుసులమ్మ పుష్కరిణి పనుల పరిశీలన

తాడేపల్లిగూడెం అర్బన్ : పురదేవత బలుసులమ్మవారి ఆలయాన్ని శోభయమాన క్షేత్రంగా తీర్చిదిద్దుతున్నట్టు ఉపముఖ్యమంత్రి, దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ తెలిపారు. బలుసుమ్మ అమ్మవారి ఆలయప్రాంగణంలో నిర్మిస్తోన్న అన్నదాన భవనం, తెప్పోత్సవం నిర్వహించేందుకు పుష్కరిణి నిర్మాణ పనులు మంత్రి కొట్టు సోమవారం పరిశీలించారు. మంత్రి కొట్టు మాట్లాడుతూ అమ్మవారి ఆలయ అభివృద్ధికి సుమారు రూ.2 కోట్లు వెచ్చించామని మరో రూ.1.50 కోట్లు వెచ్చించి మరింత అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. పుణ్యదినాల సమయంలో సుమారు వెయ్యి మంది ఒకేసారి కుంకుమ, సర్వస్వతి పూజలు నిర్వహించుకొనేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్టు చెప్పారు. ప్రభుత్వంతో పాటు భక్తుల సహకారంతో శ్రీ బలుసులమ్మ దేవస్థానం దేదీప్యమానంగా వెలుగు తోందని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ అనపర్తి శామ్యూల్, కొట్టు విశాల్, చెన్నా జనార్దనరావు, అడ్డాల నర్సింహరావు, బొద్దాని శ్రీనివాసరావు, డి.లీలావతి, బోణం ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



బలుసులమ్మ పుష్కరిణి పనులను పరిశీలిస్తున్న ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

స్వచ్ఛ భారత్ విజయవంతంపై ధన్యవాదాలు

రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి

తణుకు అర్బన్: ఇండియన్ స్వచ్ఛ లీగ్‌లో భాగంగా స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి శుభాకాంక్షలు తెలుపుతున్నామని రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. తణుకు కమ్మ కల్యాణ మండపం ఆవరణలో సోమవారం నిర్వహించిన స్వచ్ఛ భారత్ ముగింపు కార్యక్రమంలో మంత్రి కారుమూరి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. స్వచ్ఛభారత్ కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరూ నేటితో ఈ కార్యక్రమాన్ని వదిలేయకుండా ప్రజలందరికీ, తోటివారికి మన ఇల్లు, మన వీధి, మన ఊరు అనే విధంగా స్వచ్ఛభారత్‌కి తోడ్పడే విధంగా పాటుపడాలని సూచించారు. అనంతరం స్వచ్ఛభారత్ ఉద్దేశాన్ని తెలిపే విధంగా రూపొందించిన పాటకు విద్యార్థులు నృత్యం చేశారు.

పారిశుధ్య కార్మికులకు సత్కారాలు..

స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా విశేషంగా పచ్చదనం పరిశుభ్రతకు తోడ్పడిన పారిశుధ్య కార్మికులను మంత్రి కారుమూరి ఘనంగా సత్కరించి సర్టిఫికెట్‌లు అందచేశారు. మంత్రి కారుమూరి పుట్టిన రోజును పురస్కరించకుని పారిశుధ్య కార్మికులకు దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అంబికా నృత్య అకాడమీ నృత్యకారులు చేసిన నృత్యప్రదర్శన ఆహుతులను అలరించింది. మునిసిపల్ కమిషనర్ కేటీ సుధాకర్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో మునిసిపల్ డీఈఈ కొవ్వూరి ఈశ్వరరెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ చిట్టూరి శ్రీవెంకట సుబ్బారావు, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య, మునిసిపల్ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.



తణుకులో విద్యార్థులు, పారిశుధ్య కార్మికులకు సర్టిఫికెట్స్ అందచేసిన మంత్రి కారుమూరి



తణుకులో ఇండియన్ స్వచ్ఛలీగ్‌లో భాగంగా నృత్యం చేస్తున్న విద్యార్థినులు

ఓపీ గోయంకాకు డిప్యూటీ సీఎం పరామర్శ



త్రిఫుల్ ఎఫ్ అధినేత ఓపీ గోయంకాను పరామర్శిస్తున్న ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

పెంటపాడు: ప్రముఖ పారిశ్రామికవేత్త, ఫుడ్ ఫ్యాడ్స్ అధినేత ఓపీ గోయంకాను ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ పరామర్శించారు. ఇటీవల గోయంకా పెద్ద అల్లుడు ముంబైకి చెందిన పారిశ్రామిక వేత్త పంకజ్ కజారియా అనారోగ్యంతో కన్నుమూశారు. ఈ సందర్భంగా సోమవారం సాయంత్రం ప్రత్తిపాడులోని గోయంకా నివాసంలో ఆయన్ని కేఎస్ఎన్ పరామర్శించారు. పంకజ్ కజారియా కుటుంబసభ్యులకు సానుభూతి తెలిపారు. మంత్రి వెంట యువనేత కొట్టు విశాల్, చెన్నా జనార్ధనరావు, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ కర్రి భాస్కరరావు, మున్సిపల్ కమిషనర్ అనపర్తి శామ్యూల్ పాల్గొన్నారు.

ఘనంగా మంత్రి కారుమూరి, సునీల్ పుట్టినరోజు వేడుకలు

తణుకు అర్బన్: రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు, వారి తనయులు, యువనేత కారుమూరి సునీల్ కుమార్ పుట్టినరోజు వేడుకలు సోమవారం తణుకులో ఘనంగా నిర్వహించారు. తణుకు కల్యాణ మండపంలో నిర్వహించిన ఈ వేడుకల్లో భాగంగా మంత్రి కారుమూరి, యువనేత సునీల్‌కుమార్ భారీ కేకు కట్ చేశారు. మంత్రి కారుమూరి మాట్లాడుతూ రైతు కుటుంబం నుంచి రాజకీయాల్లోకి వచ్చిన తనను మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి ఎంతగానో ప్రోత్సహించించారని, అదే ఒరవడితో ఆయన తనయులు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తనకు మంత్రి పదవిని అందించి వారి కొలువులో మంత్రి అయ్యే భాగ్యాన్ని కల్పించారన్నారు. పదిమందికి మంచి చేయాలనే ఉద్దేశంతోనే జీవిస్తున్నానని, చివరి ఊపిరి వరకు అందరివాడిగానే జీవిస్తానని స్పష్టం చేశారు.

దివ్యాంగులకు బ్యాటరీ ట్రైసైకిళ్ల పంపిణీ

తణుకు నియోజకవర్గానికి చెందిన ముగ్గురు దివ్యాంగులకు బ్యాటరీతో నడిచే ట్రైసైకిళ్లను పుట్టినరోజు వేడుకల్లో భాగంగా యువనేత కారుమూరి సునీల్‌కుమార్ చేతులమీదుగా అందజేశారు.

పలువురి శుభాకాంక్షలు

మంత్రి కారుమూరి సతీమణి లక్ష్మీకిరణ్, పి.గన్నవరం ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు, ఎమ్మెల్సీలు వంక రవీంద్రనాథ్, కవురు శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యే పసల కనకసుందరరావు, వైఎస్సార్‌సీపీ ఉండి ఇన్‌చార్జ్ పీవీఎల్ నర్సింహరాజు, జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ, టీటీడీ బోర్డు మాజీ మెంబర్ గోకరాజు రామరాజు, వివిధ విభాగాల అధికారులు, పలు యూనియన్‌ల నాయకులు పుట్టినరోజు వేడుకల్లో పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం భారీ కేకును కట్‌చేశారు. ఏఎంసీ మాజీ చైర్మన్ చిట్టూరి శ్రీవెంకట సుబ్బారావు, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య, తణుకు, అత్తిలి, ఇరగవరం మండల అధ్యక్షులు బోడపాటి వీర్రాజు, పైబోయిన సత్యనారాయణ, కొప్పిశెట్టి దుర్గాప్రసాద్, అత్తిలి ఏఎంసీ చైర్మన్ బుద్దరాతి భరణి ప్రసాద్, డీసీఎంఎస్ డైరెక్టర్ పెన్మెత్స సుబ్బరాజు, రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ మెహర్ అన్సారీ, ఇల్లింద్రపర్రు సొసైటీ అధ్యక్షులు మల్లిరెడ్డి నాగార్జున, పట్టణ మహిళాధ్యక్షురాలు నూకల కనకదుర్గ, జేసీఎస్ పట్టణ కన్వీనర్ ఇందుగపల్లి బలరామకృష్ణ, ఏఎంసీ చైర్మన్ నత్త కృష్ణవేణి, వైస్ చైర్మన్ మారిశెట్టి శివశంకర్, జెడ్పీ కో–ఆప్షన్ సభ్యులు ఎండీ హబీబుద్దీన్, సుద్దుల పాండు, జంగం ఆనంద్ కుమార్, చేశెట్టి లలితా శంకర్, నత్తా భాను ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



తణుకులో కేకు కట్ చేస్తున్న మంత్రి కారుమూరి, తనయుడు సునీల్‌కుమార్, చిత్రంలో కారుమూరి సతీమణి లక్ష్మీకిరణ్ తదితరులు



దివ్యాంగులకు బ్యాటరీ ట్రైసైకిళ్లు అందిస్తున్న కారుమూరి సునీల్‌కుమార్